# విషాదాంధ్ర

శ్రీ శ్రీ

బాకాలు లాభంలేదు బాజాలు లాభంలేదు
ఎంత యీదినా ఏం ఫాయిదా ఎక్కడా తీరం కనపడదు
తలమాత్రం మీదికుంచి నిలువీత ఈదుతున్నాం
గమనం పిసరూలేదు గమ్యం అసలే లేదు
పట్టాభిరామస్వామిమీద ప్రమాణంచేసి చెబుతున్నా
అంతా గజీతగాళ్ళే మళ్ళీ అరగజం పురోగమనం లేదు
ఆదర్శప్రాయంగా అభినయిస్తున్నాం అయినా ఎవరూ మనల్ని చూడ్రు
అరుస్తున్నాం గొంతుచించుకుని అయినా ఎవరూ విన్రు
మనలో కొంతమంది కవులు మధురంగా నిశ్వసిస్తారు
యతిప్రాసలు సరిపోతాయి పదాలు మజాగా పడతాయి
పౌరుషానికి లోటులేదు ప్రశస్తికి కూడా డిటో
పద్యాలకి పళ్లురాలవు చింతకాయలు చెట్టుమీదే ఉన్నాయి
ఈ గొంగళీ వయస్సు ఇరవై అయిదేళ్లు
ఇంకా ఎక్కువే అనుకో ఎవడు చూశాడు లెక్కలు
తీర్మానాలూ ఉపవాసాలూ చేశాం ఖద్దరూ కేకలూ వేశాం
మోసుకొచ్చాం స్వరాజ్యమ్మూట మూటవిప్పితే ఏమీలేదు
అరవిందఘోషు ఆశీర్వదించాడు కదా
ముమ్మిడివరం బాలయోగి ఏమంటాడో
ఆంజనేయదండకం వల్లిస్తేనో
అన్నట్టు సాయిబాబాకి మొక్కుకోకూడదూ
మహారణ్యంలో మధ్యాహ్నంలా ఒక స్తబ్ధత నిశ్శబ్దత
రాత్రిపూట వేట ముగించుకొని క్రూరమృగాలు నిద్రిస్తున్నాయి
చిల్లరజంతువులు భయంతో ఎక్కడవక్కడ ఇరుక్కుపోయాయి
ఎప్పుడేనా ఒకపక్షి ఎగిరితే ఎక్కడో ఒక ఆకురాలి చప్పుడు
శిశువుకి దక్కని స్తన్యంలాగ ప్రవహిస్తున్నాయి గోదావరి నీళ్లు
బద్దలైన గుండెల్లాగ బీటలు వేశాయి పొలాలు
మన పరిశ్రమలు ప్రణాళికల్లోనే మన ప్రతిభ చాకిరీకి తాకట్టు
మనకో ఇల్లంటూ లేదు రచ్చకెక్కె రాద్ధాంతాలు
కొంగల్లారా జపంచెయ్యండి ఢిల్లీ పఠించు మంత్రాలు
ఎలకల్లారా సభ జరపండి ఎవరు గంటకట్టాలని
ఇంకోమారు ఎగరవే నక్కా ఈసారి అందవచ్చు ద్రాక్షపళ్ళు
కోతీ తీసుకురా త్రాసు పంపకం తెగడం లేదు

(పై కవిత తొలిసారి "తెలుగుస్వతంత్ర" 29-7-1949 సంచికలో ప్రచురింపబడింది. మూడున్నర నిండు సంవత్సరాలు గడిచాయి. కాని మనం ఒక్క అడుగైనా ముందుకువేశామా? లేక నేటికీ యివే పంక్తులు అన్వయిస్తున్నవా? నాయకులు సమాధానం చెప్పవలసి ఉంది.)